సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 30 । ఆగస్టు । 2023



సల్లంగా చూడు పోశవ్వతల్లీ

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలు.. డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు తరలివచ్చారు. భారీగా భక్తులు రావడంతో గుడి వద్ద రద్దీ కనిపించింది.

న్యూస్‌రీల్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సూచించారు. గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు మంగళవారం సీబీసీ ఎస్(చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం)పై అవగాహన కల్పించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. సెమి నార్స్, ప్రాజెక్టువర్క్స్, ఫీల్డ్ ట్రిప్స్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్ పాల్గొన్నారు.

అటవీ సంపదకు నష్టం కలిగిస్తే చర్యలు



రుద్రంగి శివారులో పట్టుకున్న టేకు దుంగలు

రుద్రంగి(వేములవాడ): అటవీ సంపదకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై రాజేశ్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్‌రావు, బీట్ ఆఫీసర్ బాలకృష్ణ హెచ్చరించారు. రుద్రంగి శివారు అటవీప్రాంతంలో టేకు దుంగలను నిలువ ఉంచారనే సమాచారంతో మంగళవారం తనిఖీలు చేశారు. ఈక్రమంలో రూ.17వేల విలువ చేసే 30 టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

రుగ్వేద యజ్ఞోపవితధారణ



నిర్వహిస్తున్న రుగ్వేద బ్రాహ్మణులు

వేములవాడ: పట్టణంలోని రుగ్వేద బ్రాహ్మణులు మంగళవారం నూతన యజ్ఞోపవితధారణ నిర్వహించారు. రాజన్న ఆలయ మహామండపంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఈ కార్యక్రమం నిర్వహించారు.


సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: వేములవాడ పట్టణ ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి సూచించారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో మాట్లాడారు. ఎజెండా అంశాలపై గౌరవ పాలకవర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులతో చర్చించి అంశాలను ఆమోదం తెలిపినట్లు చెప్పారు. పట్టణంలో శానిటేషన్ సక్రమంగా లేదని, డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని సభ్యులు తెలిపారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఏశాలు నర్సింహస్వామి, నర్మద పాల్గొన్నారు.

మెరుగైన బోధనతో లోపాల గుర్తింపు



వేములవాడరూరల్: విద్యార్థులకు మెరుగైన బోధనల ద్వారా అభ్యసన లోపాలను గుర్తించొచ్చని జిల్లా విద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. వేమువాడఅర్బన్ మండలం రుద్రవరం ప్రభుత్వ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయుల ఉన్నతి శిక్షణను తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించి తరగతి అభ్యసన ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సెక్టోరల్ అధికారి శైలజ, కోర్సు డైరెక్టర్ కోడూరి మధుకర్, హెచ్‌ఎం భూమయ్య పాల్గొన్నారు.

ఆశావహుల్లో డాక్టర్లే ఎక్కువ!

- ఏడుగురు వైద్యులు, ముగ్గురికి డాక్టరేట్లు
- బీటెక్ బాబులు, వకీల్‌సాబ్‌లకూ కొదవేం లేదు
- అన్ని పార్టీల నుంచి ఎక్కువమంది పట్టభద్రులే
- ఉమ్మడి జిల్లా ఆశావహుల్లో విద్యాధికులే ఎక్కువ



సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలోపడ్డాయి. ఇందులో బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ఒకడుగు ముందే వేయగా.. కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుని కసరత్తు ప్రారంభించిది. ఇక బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికలో సీరియస్‌గానే పనిచేస్తోంది. మొత్తానికి అన్ని పార్టీల అభ్యర్థులకు అంగబలం, అర్థబలం, సామాజిక వర్గాలతోపాటు విద్యావంతులను ఎంపికచేసే పనిలోపడ్డాయి. ప్రస్తుతం పోటీకి సిద్ధంగా ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు దాదాపుగా ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. అన్ని పార్టీలపరంగా ఆశావహుల విద్యార్హతలను పరిశీలిస్తే.. అందరిలో అధికంగా డాక్టర్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో వకీల్‌సాబ్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, బీటెక్‌బాబులు, గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో ఈసారి అసెంబ్లీ బరిలో ఉన్నత విద్యావంతుల చాలామంది నిలవనున్నారు.

పదిమంది పేర్ల ముందు డాక్టర్

1. డాక్టర్ సంజయ్, ఎంఎస్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్–జగిత్యాల)
2. డాక్టర్ సంజయ్, ఎంఎస్ (బీఆర్‌ఎస్–కోరుట్ల)
3. డాక్టర్ భోగ శ్రావణి, బీడీఎస్ (బీజేపీ–జగిత్యాల)
4. డాక్టర్ వికాస్‌బాబు, ఎంబీబీఎస్ (బీజేపీ– వేములవాడ)
5. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంఎస్ (కాంగ్రెస్–మానకొండూరు)
6. డాక్టర్ బల్మూరి వెంకట్, ఎంబీబీఎస్ (కాంగ్రెస్–హుజూరాబాద్)
7. డాక్టర్ జీఎస్ వెంకట్, ఎంబీబీఎస్ (బీజేపీ–కోరుట్ల)

పీహెచ్‌డీ డాక్టర్లు

8. డాక్టర్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్–మానకొండూరు)
9. డాక్టర్ కొనగాల మహేశ్ (కాంగ్రెస్–కరీంనగర్)
10. డాక్టర్ మేడిపల్లి సత్యం (కాంగ్రెస్–చొప్పదండి)

వకీల్‌సాబ్‌లు వీరే..

1. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎల్‌ఎల్‌బీ, ఎమ్మెల్యే (కాంగ్రెస్–మంథని)
2. టి.జీవన్‌రెడ్డి, ఎల్‌ఎల్‌బీ, ఎమ్మెల్సీ (కాంగ్రెస్–జగిత్యాల)
3. ఎ.మోహన్, ఎల్‌ఎల్‌బీ, మాజీ ఎమ్మెల్యే (మానకొండూరు)
4. కేకే మహేందర్‌రెడ్డి, ఎల్‌ఎల్‌బీ (కాంగ్రెస్–సిరిసిల్ల)

ఇంజినీర్ నేతలు

1. గంగుల కమలాకర్, బీటెక్(సివిల్) మంత్రి (బీఆర్‌ఎస్–కరీంనగర్)
2. దాసరి ఉష, బీఎస్సీ ఐఐటీ ఖరగ్‌పూర్ (పెద్దపల్లి, ఐఐటీ ఖరగ్‌పూర్)
3. చలిమెడ లక్ష్మీనరసింహారావు, బీటెక్ (బీఆర్‌ఎస్– వేములవాడ)
4. వొడితెల సతీశ్‌బాబు, ఎంటెక్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్–హుస్నాబాద్)
5. నక్కా విజయ్‌బాబు, బీటెక్ (బీజేపీ– ధర్మపురి)

పోస్ట్ గ్రాడ్యుయేట్

1. కేటీఆర్, ఎంబీఏ(యూఎస్ఏ), మంత్రి (బీఆర్‌ఎస్–సిరిసిల్ల)
2. కోరుకంటి చందర్, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్– రామగుండం)
3. దాసరి మనోహర్‌రెడ్డి, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్– పెద్దపల్లి)
4. పొన్నం ప్రభాకర్, ఎంఏ, మాజీ ఎంపీ (కాంగ్రెస్– హుస్నాబాద్)
5. సోమారపు సత్యనారాయణ, పీజీ (బీజేపీ–రామగుండం)
6. జువ్వాడి నర్సింగరావు, పీజీ (కాంగ్రెస్–కోరుట్ల)

గ్రాడ్యుయేట్లు

1. ఈటల రాజేందర్, బీఎస్సీ, ఎమ్మెల్యే (బీజేపీ–హుజూరాబాద్)
2. బండి సంజయ్, డిగ్రీ, ఎంపీ (బీజేపీ–కరీంనగర్)
3. రోహిత్‌రావు, గ్రాడ్యుయేషన్ (ఆస్ట్రేలియా) (కరీంనగర్–కాంగ్రెస్)
4. కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ (కరీంనగర్–కాంగ్రెస్)

కాంగి'రేస్'లో 85 మంది!



- దరఖాస్తుల వెల్లువ!
- పోటెత్తిన అభ్యర్థనలు
- అత్యధికంగా కరీంనగర్‌కు, అత్యల్పంగా జగిత్యాలకు
- 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ హోరాహోరీ
- టికెట్‌పై అందరి ధీమా, మొదలైన పైరవీలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆశావహుల జాబితా సిద్ధమైంది. రాష్ట్రంలో ఎన్నికలకు అధికార బీఆర్‌ఎస్ సమరశంఖం పూరించిన నేపథ్యంలో కాంగ్రెస్ కూడా పోటీకి నేతల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికి లీడర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్‌కు 15 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా జగిత్యాలకు ఒకే ఒక్క దరఖాస్తు రావడం గమనార్హం. గతంలోలా కాకుండా ఈసారి ఇప్పటికే తమ పార్టీ స్థితిగతులపై పలుదఫాలుగా సర్వేలు చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇపుడు ఆ సర్వే ఫలితాల ఆధారంగా టికెట్ కేటాయించనుందని సమాచారం. సామాజిక వర్గాల వారీగా ఓసీ, బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు ధరావత్తు సొమ్ము చెల్లించి మరీ తమ ఆకాంక్షను పార్టీకి తెలియజేశారు. ఈనెల 25తో దరఖాస్తులకు గడువు ముగియడంతో వాటి పరిశీలన మొదలైంది. ఈ వడపోత కార్యక్రమం ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ప్రకటిస్తారా? లేక కొత్తగా పార్టీలో చేరేవారికి దరఖాస్తుకు మరోసారి గడువు పెంచుతారా? అన్న విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే గాంధీభవన్ నుంచి ఢిల్లీ వరకు ఎవరి పైరవీలు వారు ప్రారంభించారు. తమకే టికెట్ కేటాయించాలని, ఒక్కఛాన్స్, చివరి ఛాన్స్ అంటూ అన్ని రకాల యత్నాలు చేస్తున్నారు.

13 నియోజకవర్గాల్లో దరఖాస్తులు ఇలా..

కరీంనగర్–15: రేగులపాటి రమ్యారావు, మేనేని రోహిత్‌రావు, డాక్టర్ కొనగాల మహేశ్, వైద్యుల అంజన్‌కుమార్, మొహమ్మద్ అబ్దుల్ షమీద్ (నవాబ్), కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురమల్ల శ్రీనివాస్, జువ్వాడి నిఖిల్ చక్రవర్తి, రేగులపాటి రితీశ్‌రావు, సత్తు మల్లయ్య, కర్ర సత్యప్రసన్న, పడాల రాహుల్, ఎండీ రహమత్ హుస్సేన్, కొత్త జైపాల్‌రెడ్డి

చొప్పదండి–7: మేడిపల్లి సత్యం, జిల్లాల భానుప్రియ, వెన్న రాజమల్లయ్య, కాశిపాక రాజేశ్, చిగురు శకుంతల, నాగి శేఖర్, మైక లక్ష్మణ్

మానకొండూర్–2: డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తిప్పార సంపత్

హుజూరాబాద్–13: పాతి రామకృష్ణారెడ్డి, జాలి కమలాకర్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, ప్యాట రమేశ్, కె.బుచ్చిరెడ్డి, గూడెపు సారంగాపాణి, బల్మూరి వెంకట నర్సింగ్‌రావు, టి.రవీందర్, కశ్యప్ రెడ్డి ముద్దసాని, సాయిని, రవికుమార్, పూదరి రేణుక, దాసరి భూమయ్య, తిప్పార సంపత్

హుస్నాబాద్–06: పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, బాలిశెట్టి శివయ్య, వొంటెల రత్నాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్

పెద్దపల్లి–05: కిరణ్‌కుమార్ వెల్పుల, చింతకుంట విజయరమణారావు, గంట రాములు, చిట్టి ధర్మయ్య, ఈర్ల కొమురయ్య

రామగుండం–06: ఎంఎస్ రాజ్‌ఠాకూర్, హరికర వేణుగోపాల్‌రావు, బాజీపాల్ జనక్‌ప్రసాద్, అంచర్ల మహేశ్ యాదవ్, రియాజొద్దీన్ అహ్మద్, గంట సత్యనారాయణరెడ్డి

మంథని–02: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శివనాద్రి ప్రమోద్‌కుమార్,

వేములవాడ–04: ఆది శ్రీనివాస్, ఎం.చంద్రశేఖర్ యాదవ్, టి.అంజయ్యయాదవ్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

సిరిసిల్ల–04: సంగీతం శ్రీనివాస్, చీటి ఉమేశ్‌రావు, నాగుల సత్యనారాయణ, కేకే మహేందర్‌రెడ్డి

జగిత్యాల–01: తాటిపర్తి జీవన్‌రెడ్డి

కోరుట్ల–13: కల్వకుంట్ల సుజిత్‌రావు, కొమొరెడ్డి జ్యోతిదేవి, జువ్వాడి నర్సింగరావు, రుద్ర శ్రీనివాస్, రుద్ర శంకర్, మొహమ్మద్ షకీర్ సిద్దిఖీ, కొమొరెడ్డి కరమ్ చంద్, కోట దుర్గారాజ్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఆసిఫ్ హబీబ్, అలే పాండురంగా, మొహమ్మద్ హబీబ్ ఖాన్

ధర్మపురి–07: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గజ్జెల స్వామి, వడ్లూరి కృష్ణ, గుమ్మడి కుమారస్వామి, బండారి కనుకయ్య, రవీందర్ మద్దెల, బొల్లి స్వామి

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేరప్రవర్తనకు దూరంగా ఉండాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ కొన్ని కారణాలు, సంఘటనలతో రౌడీషీటర్లుగా మారిన వారు సమాజంలో మంచిగా ఉండాలన్నారు. వారి జీవన విధానంతోపాటు ప్రస్తుత వారి కుటుంబం స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. నేర ప్రవృత్తిని వీడాలని సూచించారు. ఇప్పటికీ తీరు మార్చుకోకపోతే పీడీయాక్ట్ పెట్టడానికి వెనుకాడమని హెచ్చరించారు. సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఏఎంసీలకు పాలకవర్గాలు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పూసవెల్లి సరస్వతి, వైస్‌చైర్మన్ బండారి శ్యామ్‌సుందర్, ఎల్లారెడ్డిపేట ఏఎంసీ చైర్మన్‌గా ఎలుసాని మోహన్‌కుమార్,వైస్‌చైర్మన్‌గా బందారపు బాల్‌రెడ్డి, గంభీరావుపేట చైర్మన్‌గా కొత్తింటి హనుమంతురెడ్డి, వైస్‌చైర్మన్ గోగు లింగంయాదవ్, ముస్తాబాద్ చైర్మన్‌గా అక్కరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌గా నాగుల శ్రీనివాస్‌గౌడ్, వీర్నపల్లి చైర్మన్‌గా గుజ్జుల రాజిరెడ్డి, వైస్ చైర్మన్‌గా భూక్య తులసీరాంలను నియమించింది.

'దొరలపాలనకు చరమగీతం పాడాలి'



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి/వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలో 40 ఏళ్లుగా అధికారంలో ఉంటున్న దొరల పాలనకు చరమగీతం పాడాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. ఒకరు పోతే.. మరొకరు..డబ్బు ఉందనే అహంకారంతో ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తున్నారని విమర్శించారు. రుద్రంగి, వేములవాడల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. వేములవాడరూరల్ మండలం నాగయ్యపల్లికి చెందిన రొండి రాజును రూరల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీలను మోసం చేసిందన్నారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి ఇస్తానని మోసం చేసిన ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాప్రతిజ్ఞ చేసి, మహిళల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. డీఈవో రమేశ్‌కుమార్, డీవైఎస్‌వో రాందాస్, డీపీఆర్వో మామిండ్ల దశరథం, ఎస్.తిరుపతి, దేవత ప్రభాకర్, గుడ్ల రవి, సానబాబు, వడ్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటర్లకు స్వేచ్ఛా వాతావరణం కల్పించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలి : ఎస్పీ



సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్లటౌన్: ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని పోలింగ్ సెక్టార్ అధికారులకు కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల రెబిలిటీ మ్యాపింగ్ రూపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి సెక్టోరియల్ అధికారి తమ పరిధిలోని పోలీంగ్‌కేంద్రాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేయాలని సూచించారు. మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారులతో కలిసి రెబిలిటీ మ్యాపింగ్ ప్రాథమిక ఎక్సర్‌సైజ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలన్నారు. అదనపు కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, సత్యప్రసాద్, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఈ పదవులు మాకొద్దు



లేఖలు చూపుతున్న మల్లయ్య, రాజు

ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవులు తమకు వద్దని ముస్తాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ముక్క మల్లయ్య, అనమేని సునంద మంత్రి కేటీఆర్‌కు మొరపెట్టుకున్నారు. ఈమేరకు మంగళవారం మంత్రి కేటీఆర్‌కు లేఖ రాశారు. ముస్తాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కొద్ది రోజులుగా కోరుతున్నారు. ఈనేపథ్యంలో మార్కెట్ కమిటీ పాలక మండలిని ప్రభుత్వం ప్రకటించింది. ముస్తాబాద్‌కు చెందిన ముక్క మల్లయ్య, అనమేని రాజు భార్య సునందలకు డైరెక్టర్‌లుగా అవకాశం కల్పించారు. తమకు పదవులు ఇచ్చిన కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూనే.. ఆ పదవులు వద్దని లేఖలు రాశారు. చైర్మన్ పదవిని ఇతర గ్రామాల నాయకులకు కట్టబెట్టడంతోనే డైరెక్టర్ పదవులు తిరస్కరించినట్లుగా అందరూ భావిస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆరోగ్య మహిళ'

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



స్టాఫ్ నర్సులకు ట్యాబ్స్ అందిస్తున్న డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రతీవారం నిర్వహిస్తున్నటు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఎస్‌సీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఓపీడీ 397, బ్రెస్ట్ 393, ఓరల్ కావిటీ 393 పరీక్షలు చేసినట్లు తెలిపారు. యూటీఐ 12, ల్యాబ్ 48, థైరాయిడ్26, విటమిన్ డీ 22, సీబీపీ 38, సూక్ష్మపోషకాలు 41 మందికి పరీక్షలు చేసి, వీరిలో ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తం

అసంక్రమిత వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు సూచించారు. జిల్లా వైద్యధికారి కార్యాలయంలో మంగళవారం స్టాఫ్ నర్సులకు శిక్షణనిచ్చి మాట్లాడారు. వ్యాధులపై అవగాహన కల్పిస్తూ.. నెలవారీ రిపోర్టులను పరిశీలించారు. అనంతరం ట్యాబ్స్ పంపిణీ చేశారు. వైద్యులు తేజ్ కిరణ్‌రెడ్డి, ఎస్.రజిత తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.70 కోట్లు



వేములవాడ: రాజన్నకు 24 రోజుల వ్యవధిలోనే హుండీల ద్వారా రూ.1.70 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఓపెన్‌స్లాబ్‌లో మంగళవారం అధికారులు, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు లెక్కించారు. రూ.1,70,50,409 నగదు, బంగారం 199 గ్రాములు,వెండి 15.250 కిలోలు సమకూరిటన్లు తెలిపారు.

మిషన్ భగీరథ నీరే తాగాలి

- నాణ్యత ప్రమాణాలతో సరఫరా
- మిషన్ భగీరథ ఎస్‌ఈ రవీందర్
- సబ్ డివిజనల్ హెల్పర్లకు శిక్షణ

సిరిసిల్లటౌన్: ప్రజలు మిషన్ భగీరథ నల్లా నీరు తాగడం శ్రేష్ఠమని, నాణ్యత ప్రమాణాలతో సరఫరా చేస్తున్నట్లు మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.రవీందర్, ఈఈ ఎం.జానకీ తెలిపారు. కొత్తగా నియమితులైన వేములవాడ సబ్‌డివిజనల్ హెల్పర్లకు మంగళవారం రుద్రవరం పరిధిలోని గుర్రంవానిపల్లిలో శిక్షణనిచ్చారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ ప్రక్రియలు చేపట్టంపై వివరించారు. క్లోరోస్కోపు మిషన్ ద్వారా మిషన్ భగీరథ నీటిని పరీక్షించి ఆర్‌వో వాటర్‌కు, మిషన్‌భగీరథ నీటికి మధ్య తేడాలను వివరించారు.



సబ్‌డివిజన్ హెల్పర్ల శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

క్లుప్తంగా

స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని రాజేశ్వర్‌రావునగర్ గ్రామంలో వారసంత జరిగే ప్రాంతంలో సెస్ నిధులు రూ.2 లక్షలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మంగళవారం ప్రారంభించారు. ప్రతీ వారం చుట్టుపక్కల గ్రామాల నుంచి సంతకు వచ్చేవారు రాత్రివేళ ఇబ్బంది పడకుండా ఉండేందుకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామాన్ని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, సర్పంచ్ పిట్ల పావని, జెడ్పీటీసీ సభ్యురాలు కొమిరిశెట్టి విజయ, ఎంపీటీసీ సభ్యుడు అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ లింగంయాదవ్, నాయకులు రాజారాం, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలతో ప్రజాధనం దుర్వినియోగం


మాట్లాడుతున్న గోపి

గంభీరావుపేట(సిరిసిల్ల): చెక్‌డ్యాంల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు ఇష్టారీతిన పనులు చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కోతకు గురై, నీరంతా వృధాగా పోతోందని, పంట పొలాలు కోతకు గురవుతున్నాయని తెలిపారు. మంగళవారం ఆయన చెక్‌డ్యాంను పరిశీలించారు. మల్లారెడ్డిపేట, గంభీరావుపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చెక్‌డ్యాంను సందర్శించి, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, దేవాగౌడ్, కోడె రమేశ్, సర్వోత్తం తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగకు జైలు

- సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ జడ్జి హిమబిందు తీర్పు

సిరిసిల్లటౌన్: సెల్‌ఫోన్, బైక్‌చోరీ కేసులో ఒకరికి ఆరు నెలలు జైలు శిక్ష పడింది. ప్రాసిక్యూషన్, కోర్టు పీసీ నరేశ్ తెలిపిన వివరాలు. మే 31న సిరిసిల్లకు చెందిన వొడ్నాల రవికిరణ్ తన సెల్‌ఫోన్, జూలై 3న ఎనగందుల శ్రీకాంత్ తన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదుచేసిన సిరిసిల్ల పోలీసులు సెల్‌ఫోన్, బైక్ దొంగతనం చేసింది తంగళ్లపల్లికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌గా గుర్తించి అరెస్టు చేసి చార్జీషీటును దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

ఆపద ప్రబంధన్ పురస్కారాలకు దరఖాస్తులు

సిరిసిల్లఅర్బన్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని 2024 సంవత్సరానికి ఆపద ప్రబంధన్ పురస్కారాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మంగళవారం తెలిపారు. విపత్తు నిర్వహణలో విశేష కృషిచేసిన వ్యక్తులు, సంస్థలు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

‘నాంపల్లి’పై చిన్నచూపు

- నరసింహుడి ఆలయంపై పట్టింపు కరువు
- కనిపించని మౌలిక వసతులు
- పారిశుధ్య పనులకు సిబ్బంది లేక ఇబ్బంది


నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

వేములవాడఅర్బన్: మూడువైపులా పచ్చని పొలాలు.. ఒక వైపు మధ్యమానేరు జలదృశ్యంతో ప్రకృతి ఒడిలో సేదతీరినట్టు ఉన్న నాంపల్లి గుట్టపై అధికారులకు పట్టింపు కరువైంది. కనీస వసతుల కల్పనలో నిర్లక్ష్యంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న అనుబంధ దేవాలయం నాంపల్లి గుట్ట అభివృద్ధిపై ఆలయ అధికారులు, పాలకులకు పట్టింపు కరువైంది. ఫలితంగా వేలాదిగా వస్తున్న భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

మౌలిక వసతులు కరువు

నాంపల్లిగుట్టపై శ్రీలక్ష్మీనృసింహస్వామి వెలశారు. రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులలో సగానికి పైగా నాంపల్లిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. శ్రావణమాసం, మహాశివరాత్రి ప్రత్యేక సందర్భాల్లో భక్తుల రాక ఎక్కువగా ఉంటుంది. అయితే ఇక్కడ భక్తులకు కనీస వసతులు లేవు. మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. వానకు తడుస్తూ.. ఎండకు చెమటలు కక్కుతూ చెట్ల కింద తలదాచుకుంటున్నారు. ఇక్కడికి వచ్చే చాలా మంది భక్తులు స్వామికి కోడిని కోసి మొక్కు చెల్లించుకోవడం ఆనవాయితీ. వంటలు చేసుకునేందుకు ఇక్కడ వసతిగదులు లేవు. చెట్ల కిందనే వంటలు చేసుకుంటున్నారు. అయితే ఇటీవల కోతుల బెడద తీవ్రమైంది. వంటలు అన్ని పూర్తయ్యాక వంటపాత్రలను కోతులు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.

మరమ్మత్తులపై పట్టింపు లేదు

నాంపల్లి గుట్టపైకి భక్తులు వాహనాలలో వస్తుంటారు. శ్రావణమాసంలో నిత్యం 90 బైకులు, 100 వరకు కార్లు, 70 వరకు ఆటోలు వస్తుంటాయి. ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో కయ్యలు కోసి ప్రమాదకరంగా మారింది. ఘాట్ రోడ్డుకు సగం వరకే ఇనుప రేలింగ్ ఏర్పాటు చేశారు. పూర్తిగా రేలింగ్ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కనిపించని వసతి

- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. తాత్కాలికంగా ఏర్పాట్లు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయి.
- తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- పారిశుధ్య సిబ్బంది నలుగురు ఉన్నారు. ఇందులో ఇద్దరు లడ్డూ కౌంటర్‌లో, మరొకరు కాళీయ మర్దనంలో, మిగిలిన ఒకరు ఆలయం వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు.
- సరైన సంఖ్యలో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో గుట్ట పరిసరాలను పరిశుభ్రం చేసే వారు లేక దుర్గంధం వెదజల్లుతున్నాయి.
- కాళీయమర్దనంలో పారిశుద్యం అస్తవ్యస్తంగా మారింది.
- ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది.
- నరసింహస్వామి ఆలయం ముందు తడుకల పందిరి లేకపోవడంతో ఎండకు భక్తులకు ఇబ్బంది పడుతున్నారు.
- ఆలయంలోని మూడు మైకులు పనిచేయడం లేదు.
- ఆలయ పరిసరాల్లోని నాలుగు సీసీ కెమెరాలకు రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. సీసీకెమెరాల టీవీ డిస్‌ప్లే కనిపించడం లేదు.
- వాటర్ ఫౌంటేయిన్ పనిచేయడం లేదు.
- భక్తులు గుట్టపైన భోజనలు చేయడానికి వసతులు లేవు.
- గుట్టపై చెట్ల కింద భోజనాలు చేస్తుంటే కోతుల బెడదతో ఇబ్బందిగా మారింది.

నాంపల్లి గుట్టపై ఎప్పటిలాగే ఉంది



ఏటా శ్రావణమాసం నాంపల్లి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి వస్తున్నారు. గుట్టపై అభివృద్ధి ఏమి లేదు. కనీసం తాగునీరు, మౌలిక వసతులు కూడా లేవు. ఇక్కడ భోజనాలు చేద్దామంటే కోతులతో ఇబ్బందిగా మారింది.

– నాంపల్లి, భక్తుడు, మల్లాపూర్

ఏర్పాట్లు చేస్తున్నాం



శ్రావణమాసంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆలయం ముందు తడకల పందిరి వేయిస్తున్నాం. భక్తులకు లడ్డూ, పులిహోరను అందుబాటులో ఉంచుతాము. పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బందిని పెంచుతాము.

– నరేందర్, నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి

పట్టపగలే మహిళ దారుణ హత్య

- ముఖంపై పిడిగుద్దులు.. పుస్తెలతాడు చోరీ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ


జల (ఫైల్)


జల మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

రాయికల్:(జగిత్యాల): రాయికల్ పట్టణంలోని నాగారం వాడలో మంగళవారం పట్టపగలే కోల జల (48) దారుణహత్యకు గురైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జల భర్త సత్తయ్య, కొడుకు శేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. కూతురు రమ్యను ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. జల తన ఇంట్లో ఒక్కతే నివసిస్తోంది. శ్రావణమాసం సందర్భంగా మంగళవారం ఉదయం పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయానికి వెళ్లి పూజలు చేసింది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో భోజనం చేసి నిద్రిస్తుంది. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి జల పుస్తెలతాడును దోచుకెళ్లే క్రమంలో ఆమె ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రోజూ సాయంత్రం పూట ఆరుబయటకు వచ్చే జల రాకపోవడంతో గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రక్తం మరకలతో బోర్లాపడి ఉంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌ఖాన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్కాడ్, క్లూస్‌టీంలతో ఆధారాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. కోల జలను దుండగులు హత్య చేసి పుస్తెలతాడును దోచుకెళ్లినట్లు తెలిపారు. మృతురాలి కూతురు రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్‌నాయక్ తెలిపారు. ఏదేమైనా రాయికల్ పట్టణంలో పట్టపగలే మహిళ హత్యకు గురికావడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

మత్స్యకారుల తెప్పెలు దహనం


విచారణ జరుపుతున్న ఎస్సై మహేందర్

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో మత్స్యకారుల తెప్పెలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసినట్లు విలాసాగర్, జగ్గారావుపల్లి, నర్సింగాపూర్ గ్రామాలకు చెందిన మత్స్యకారులు తెలిపారు. ప్రాజెక్టు నీటిలో చేపలు పట్టిన తర్వాత తెప్పెలను ప్రాజెక్టు పరిసరాల్లో ఉంచుతామన్నారు. మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి 20 మందికి చెందిన మొత్తం 30 తెప్పెలు కాలిపోయాయని పేర్కొన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. తెప్పెల విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని మత్స్యకారులు తెలిపారు.

దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలి

తెప్పెలు దహనం చేసిన దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ జిల్లా చైర్మన్ చొప్పరి రామచంద్రం, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రణవేని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాలిపోయిన తెప్పెలను పరిశీలించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా డైరెక్టర్ లక్ష్మీరాజం, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

తడగొండలో ఇసుక డంపు మాయం


గత నెల 30న రాత్రి డంపు వద్ద ఎస్సై, ఏఎస్సై


డంపు చేసిన స్థలంలో మాయమైన ఇసుక

- వందలాది ట్రిప్పులను తరలించిన అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు గండి

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వ పనుల కోసం సేకరించిన వందలాది ట్రిప్పుల ఇసుకను ఒక్కచోట డంపు చేశారు. కానీ ప్రస్తుతం అది మాయమైంది. అక్రమార్కులు తరలించుకుపోయి, ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన ఘటన బోయినపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గ్రావిటీ కెనాల్ కోసం సేకరించిన వందల ట్రిప్పుల ఇసుక పూర్తిగా మాయమవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 2017లో ఈ కెనాల్ నిర్మాణం చేపట్టారు. అప్పటి జిల్లా మైనింగ్ అధికారుల అనుమతితో కెనాల్ పక్కన స్థలంలో సుమారు 500 ట్రిప్పుల ఇసుక డంపు చేశారు. కాగా, గత జూలై 30న ఓ వ్యక్తి జేసీబీ, టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి, వాహనాలను సీజ్ చేశారు. ఈ సంఘటనపై మరుసటి రోజు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. తర్వాత అక్కడ ఈ నెల మొదటి వారం వరకు సగం మేర ఇసుక ఉండేది. 5 రోజుల క్రితం పూర్తిగా మాయమైంది. తహసీల్దార్ పుష్పలతను వివరణ కోరగా ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలియకుండా ఇసుక తరలించడం మండలంలో చర్చనీయాంశమైంది. బాధ్యులను గుర్తించి, కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిరిసిల్లలో దీక్షలు.. ధర్నాలు


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


మంత్రి కేటీఆర్ ఆఫీస్‌లో..


దీక్ష చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

సిరిసిల్లటౌన్: సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. డబుల్‌బెడ్రూం ఇళ్లు, నివేశన స్థలాల ఆశావహులతో తరలివచ్చి, ధర్నా నిర్వహించారు. ఇళ్లురాని అర్హులైన పేదలకు నివేశన స్థలాలతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు చొప్పున చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల‌చైర్‌పర్సన్, కమిషనర్ వచ్చి, వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని సముదాయించినా వినిపించుకోలేదు. దీంతో నాయకులను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోపోద్రిక్తులైన మహిళలు ఠాణాకు వెళ్లి, గేట్ ఎదుట నిరసన తెలిపారు. టౌన్ సీఐ ఉపేందర్ వారితో మాట్లాడి శాంతింపజేశారు. నాయకులు సూరం పద్మ, వీరేశం, పోచమల్లు, తిరుపతి, స్వప్న, బాబు, కవిత, లత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్ ముట్టడి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించారు. స్థానిక కొండా లక్ష్మణ్‌బాపూజీ చౌరస్తా నుంచి వందలాది మంది ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. ఆశవర్కర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రతతోపాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం క్యాంపు ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు. సంఘం ఉపాధ్యక్షుడు మూశం రమేశ్, మోర అజయ్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భారతి, రాణి, రేణుక, రుచిత, సునంద, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌లకు టీడీపీ సంఘీభావం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ మాజీ సర్పంచ్‌లు సిరిసిల్లలో మంగళవారం 21వ రోజు రిలేదీక్ష కొనసాగించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్‌రావు వారికి సంఘీభావం తెలిపారు. మాజీ సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, వేములవాడ ఇన్‌చార్జి పులి రాంబాబు తదితరులున్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలు పరిష్కరించాలని రెండో ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలో నిరసన దీక్ష కొనసాగించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. వనజ, రేణుక, విజయలక్ష్మి, శ్రీలత, పద్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు రైతులకు అందుబాటులో ఉండి, సేవలందించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన ఎలుసాని మోహన్‌కుమార్‌ను మంగళవారం బొప్పాపూర్‌లో గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్దన్‌గౌడ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఏఎంసీల పాత్ర కీలకమన్నారు. రైతులు పంటలను సాగు చేసింది మొదలు ధాన్యం విక్రయించే వరకు పాలకవర్గం బాధ్యతగా పని చేయాలని సూచించారు. వీర్నపల్లి ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, నాయకులు శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, దేవదాస్, రవీందర్, లక్ష్మీనారాయణ, కృష్ణ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసలేం జరిగింది..!?

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి
- ఇంట్లో ఉన్నది అక్కాచెల్లెళ్లు మాత్రమే
- యువకుడితో చెల్లి వెళ్లిపోయిందా..?
- బస్టాండ్ సీసీ ఫుటేజీల్లో దృశ్యాలు


కోరుట్ల బస్టాండ్‌లో యువకుడితో చందన (సీసీ ఫుటేజీ)


విచారణ జరుపుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి


దీప్తి మృతదేహం

కోరుట్ల: ‘సోమవారం రాత్రి ఆ ఇంట్లో అక్కాచెల్లెళ్లు మాత్రమే ఉన్నారు. తెల్లారేసరికి అక్క చనిపోయి సోఫాలో పడి ఉంది. ఇంటి బయట తలుపునకు గొళ్లెం పెట్టి చెల్లి ప్రియుడితో కలిసి పరారైంది’. ఇంట్లోని కిచెన్‌లో ఓడ్కా, బ్రీజర్ బాటిళ్లు ఉన్నాయి. అసలు ఆ రాత్రి ఇంట్లో ఏం జరిగి ఉంటుంది..? అక్క చనిపోవడానికి చెల్లెలే కారణమా..? ప్రియుడితో కలిసి చెల్లె వెళ్లిపోతుంటే అక్క అడ్డుకున్న క్రమంలో గొడవ జరిగిందా.. ఈ గొడవలోనే అక్క ప్రాణాలు పోయాయా..? లేదా ఓడ్కాలో అక్కకు మత్తు ఇచ్చి చెల్లెలు గుర్తుతెలియని యువకుడితో కలిసి పరారైందా..? వోడ్కాలో కలిపిన మత్తు మందు డోసు ఎక్కువై అక్క చనిపోయిందా..?!

అనేక అనుమానాలు

కోరుట్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి మృతి వెనక లెక్కలేని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రకు చెందిన బంక శ్రీనివాస్‌రెడ్డి–మాధవి దంపతులు సుమారు పాతికేళ్లుగా కోరుట్లలోని భీమునిదుబ్బలో స్థిరపడ్డారు. ఇటుకబట్టీ వ్యాపారం చేసుకునే శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెద్ద కూతురు దీప్తి(24) పుణేలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్‌ఫ్రం హోం పద్ధతిన ఇంట్లో నుంచి పనిచేస్తోంది. చిన్నకూతురు చందన ఇటీవల బీటెక్ పూర్తి చేసింది. సోమవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి– మాధవి హైదరాబాద్‌లోని బంధువుల గృహప్రవేశం కార్యక్రమానికి వెళ్లగా దీప్తి, చందన మాత్రమే ఇంట్లో ఉన్నారు. రాత్రి 10 గంటల వరకు తండ్రితో అక్కాచెల్లెళ్లు ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

తెల్లారేసరికి..

మంగళవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లతో మాట్లాడటానికి ప్రయత్నించగా పెద్ద కూతురు దీప్తి ఫోన్ లిఫ్ట్ కాలేదు. చిన్నకూతురు చందన ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. రెండుమూడు సార్లు ఫోన్‌లో కూతుళ్లతో మాట్లాడేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌రెడ్డి చివరికి పక్క ఇంట్లో ఉన్నవారికి ఫోన్ చేశాడు. తమ కూతుళ్లు ఫోన్ ఎత్తడం లేదని చెప్పి, ఓ సారి ఇంటిదాకా వెళ్లి చూడమని కోరాడు. పక్క ఇంట్లో ఉండే ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా తలుపు బయట నుంచి గొళ్లెం పెట్టి ఉంది. పిలిస్తే ఎవరూ పలకలేదు. దీంతో తలుపు గొళ్లెం తీసి లోపలికి వెళ్లి చూడగా పెద్ద కూతురు దీప్తి సోఫాలో పడిపోయి ఉంది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పగా వారు దీప్తిని పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. బంధువులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు కిరణ్, చిరంజీవి ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఆ రాత్రి ఏం జరిగినట్లు..?

సోమవారం ఉదయం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని బంధువు ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లగా రాత్రి అక్కాచెల్లెళ్లు ఇద్దరే ఇంట్లో ఉన్నారు. కిచెన్‌లో వోడ్కా, బ్రీజర్ బాటిళ్లు, వెనిగర్, నిమ్మకాయలు ఉండటంతో రాత్రి వేళ దీప్తి, చందన కలిసి మద్యం సేవించారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి మద్యం బాటిళ్లు ఎవరు తెచ్చి ఇచ్చారు, ప్రియుడితో కలిసి పరారయ్యేందుకు ముందుగానే పథకం వేసుకున్న చందన అతడితోనే మద్యం తెప్పించి ముగ్గురు కలిసి మద్యం తీసుకున్నారా..? అన్న విషయంలో స్పష్టత లేదు. దీప్తికి మద్యంలో మత్తు కలిపి తాము పరారయ్యేందుకు పథకం వేశారా..? మత్తు డోసు ఎక్కువ కావడంతో దీప్తి మృతి చెంది ఉంటుందా..? అన్న అనుమానాలున్నాయి. చందన ప్రియుడితో కలిసి వెళ్లిపోయే ప్రయత్నాన్ని దీప్తి అడ్డుకునే క్రమంలో గొడవ జరిగి ఆ గొడవలో తగలరాని చోట దెబ్బతగిలి దీప్తి చనిపోయిందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీప్తి శరీరంపై పెద్దగా గాయాలు కనిపించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

బస్టాండ్ సీసీ కెమెరాలో చందన..

కోరుట్ల బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీల్లో మంగళవారం వేకువజామున 5 గంటలకు చందన ఓ యువకుడితో కలిసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చందన, మరో యువకుడు లగేజీ తీసుకుని నిజామాబాద్ వైపు వెళ్లే బస్సు ఎక్కినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయింది. చందన ఫోన్‌కాల్ డేటా ఆధారంగా ఆమె ఓ యువకుడితో గంటల తరబడి ఫోన్ మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నా రు. మంగళవారం రాత్రి చందన ఫోన్ లొకేషన్ హైదరాబాద్‌లో వస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారని సమాచారం. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని బూర్గుపల్లికి చెందిన కొలుపుల రామలింగం–కమల దంపతుల రెండో కుమారుడు శ్రీకాంత్(29) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. డిగ్రీ పూర్తి చేసిన శ్రీకాంత్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఆరు నెలల క్రితమే వివాహం జరిగింది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో శ్రీకాంత్ చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అందరితో కలివిడిగా ఉండే శ్రీకాంత్ మృతితో బూర్గుపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా పర్శరాములు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కంచర్ల పర్శరాములును ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజు నియమించారు. హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందించారు. తన నియామకానికి కృషి చేసిన వారందరికీ పర్శరాములు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

రేసు బాబు కుటుంబానికి ఆర్థిక చేయూత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇటీవల హఠాత్తుగా మరణించిన ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు రేసు బాబు కుటుంబానికి స్థానిక చేయూత మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేలు, 25 కిలోల బియ్యం అందించారు. భవిష్యత్‌లో పిల్లల చదువులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. చేయూత మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఒగ్గు బాలరాజుయాదవ్ మాట్లాడుతూ చిన్నవయస్సులో చనిపోయిన బాబు కుటుంబానికి పలువురు అండగా నిలవాలని కోరారు. ఫౌండేషన్ అధ్యక్షుడు దూస శ్రీనివాస్, సభ్యులు లక్ష్మారెడ్డి, అశోక్, గోపి, సాయిరెడ్డి, రవి, ధర్మేందర్ తదితరులున్నారు.

పోడు రైతులపై కేసులు ఎత్తివేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అటవీ ప్రాంతంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాలోతు సూర్యనాయక్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. దళితులకు మూడెకరాల భూమిని పంపిణీ చేయాలని కోరారు. దళిత, గిరిజన, మైనార్టీ, బీసీబంధులను పారదర్శకంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.3,016 ఇవ్వాలని, నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు చెట్కూరి నారాయణగౌడ్, నాయకులు చింతల పోచయ్య, దాస్, బాల్‌రాజ్, లక్ష్మీరాజం, చంద్రారెడ్డి, రాములు, మల్లారెడ్డి పాల్గొన్నారు.